పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు

- చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా
- గణిజర్లలో గడపగడపకు మన ప్రభుత్వం

చింతలపూడి : వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని గణిజర్ల గ్రామంలో శనివారం సర్పంచ్ బొల్లినేని వెంకట్రావు ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఎలీజా గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. మహిళలు, వృద్ధులను ఆప్యాయంగా పలకరించి ప్రభుత్వ పథకాలను వివరించారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని అన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా పలువురు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. గడపగడపకు కార్యక్రమంలో ప్రజలు ఎమ్మెల్యే ఎలీజాకు బ్రహ్మరథం పట్టారు. సచివాలయాల ద్వారా అన్ని పథకాలు నేరుగా అందుతున్నాయని గ్రామస్తులు ఎమ్మెల్యేకి తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఎంపీపీ డా బి.రాంబాబు నాయక్, జెడ్పీటీసీ ఎం.నీరజా సుధాకర్, సర్పంచ్ బి.వెంకట్రావు, ఉప సర్పంచ్ సొంగా ఉదయకుమార్, పెనుగొండ వెంకటేశ్వరరావు, యనమల సత్యన్నారాయణ, చెన్నకేశవులు, సీహెచ్ ధర్మారావు, నాగేశ్వరరావు, జె.పుల్లారావు, బుల్లాదాసు, సొసైటీ చైర్మన్ చుండూరి నాగేశ్వర్రావు, ఎస్.కాంతారావు, ఎస్.దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.


ప్రభుత్వ పథకాల బ్రోచర్ అంజేస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

క్లుప్తంగా

పారిజాతగిరిలో ప్రత్యేక పూజలు


దాతను సన్మానిస్తున్న ఆలయ అర్చకులు

జంగారెడ్డిగూడెం : పారిజాతగిరిలోని శ్రీ వేంకటేశ్వరస్వామివారికి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం 5 గంటలకు సుప్రభాతసేవ, ఆరాధన, తోమాలసేవ, తీర్థప్రసాదగోష్టి అనంతరం స్వామివారు భక్తులకు దర్శనమిచ్చారు. సర్పంచ్ పొల్నాటి శ్రీనివాసరావు, కుటుంబ సభ్యులు అన్నప్రసాద వితరణ చేశారు. దాతలను అర్చకులు స్వామి వారి శేష వస్త్రాలు, ప్రసాదాలు, వేద పండితుల ఆశీస్సులతో సన్మానించారు. కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యుడు రెడ్డి రంగప్రసాద్, వాసవీ సాయి నగేష్ పాల్గొన్నారని ఈఓ మానికల రాంబాబు తెలిపారు.

శ్రీవారి సేవలో మైన్స్ అడిషనల్ డైరెక్టర్ దంపతులు


ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మైన్స్ అడిషనల్ డైరెక్టర్ దంపతులు


ద్వారకాతిరుమల : ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయాన్ని మైన్స్ అడిషినల్ డైరెక్టర్ కె.ఇందుధరరావు, మినిస్ట్రీ ఆఫ్ ఫైనాన్స్ స్టేట్ నోడల్ ఆఫీసర్ (పీఎఫ్ఎంఎస్) ఎస్.ప్రియాంక దంపతులు శనివారం సందర్శించారు. ఆలయానికి కుటుంబ సమేతంగా విచ్చేసిన వారికి ఆలయ అధికారులు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో పండితుల నుంచి వేద ఆశీర్వచనాన్ని పొందారు.

రజకులకు చెరువులు కేటాయించాలి


డివిజనల్ పంచాయతీ అధికారి నగేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న పోసిబాబు

జంగారెడ్డిగూడెం : రజకులకు గ్రామాల్లో జీవో నెంబర్ 343 ప్రకారం చెరువులను కేటాయించాలని కోరుతూ ఉమ్మడి జిల్లా రజక సంఘం అధ్యక్షుడు చాటపర్తి పోసిబాబు డివిజనల్ పంచాయతీ అధికారి నగేష్‌కు వినతి పత్రం అందించారు. శనివారం ఆయన జంగారెడ్డిగూడెంలో పంచాయతీ అధికారి నగేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఈ సందర్భంగా పోసిబాబు మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం మండలంలోని అమ్మపాలెం గ్రామపంచాయతీ, కట్టపాదలవారిగూడెం, పోలవరం గ్రామపంచాయతీ చిన్నవారిగూడెం, మంగిశెట్టిగూడెం, అక్కంపేట తదితర గ్రామాల్లో చెరువులను కేటాయించాలని వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి కొండపల్లి రవి, మండల రజక సంఘం అధ్యక్షుడు లింగాల సత్యనారాయణ, తాళ్లపూడి శ్రీను, కూచింపూడి దుర్గారావు కూచింపూడి గంగరాజు గరికపాటి నాగరాజు, గాదిరాజు నాగేశ్వరరావు, పల్లంట్ల లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి


పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

బుట్టాయగూడెం : కుష్టు వ్యాధి నిర్మూలనపై ప్రజలు పూర్తి అవగాహన పెంచుకోవాలని దొరమామిడి పీహెచ్‌సీ ఆరోగ్య విస్తరణాధికారి ఎల్.సుబ్రహ్మణ్యం అన్నారు. మండలంలోని రెడ్డి బొడ్డేరులో కుష్టు వ్యాధి నివారణపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీరంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు కనిపించడం, చర్మంపై, చెవి కమ్మలపై బుడగలలా ఉండడం కుష్టు వ్యాధి లక్షణాలని అన్నారు. కుష్టు వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స అందించి నయం చేయవచ్చునని అన్నారు.

నాణ్యమైన ఆహారం అందించాలి

ఏలూరు (టూటౌన్): బాలలకు నాణ్యమైన ఆహారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి జి.రాజేశ్వరి సూచించారు. స్థానిక శనివారపుపేట బాలుర వసతి గృహాన్ని శనివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేశారు. వీలైనంత వరకూ సన్న రకం బియ్యం ఉపయోగించాలని, పోషక ఆహారాన్ని అందించాలని, సమస్య వస్తే తమ సంస్థ దృష్టికి తీసుకురావాలని సూచించారు. బాలురకు అందించే ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.

ఆర్థిక సహాయం అందజేత


ఆర్థిక సహాయాన్ని అందజేస్తున్న దృశ్యం

కుక్కునూరు, లింగపాలెం : కుక్కునూరు మండలం గణపవరానికి చెందిన దోబినేని సాయిబాబు క్రానిక్ అపెండిసైటిస్‌తో బాధపడుతున్నాడు. అతని ఆర్థిక పరిస్థితి కూడా బాగోలేకపోవడంతో మిత్రదీప్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు, ధర్మాజీగూడెం వైఎస్సార్ సీపీ నాయకుడు సొంగా సందీప్ శనివారం బాధితుడికిరూ.10 వేలు సహాయం అందించారు.

వైభవంగా నరసన్న గ్రామోత్సవం

ద్వారకాతిరుమల : శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన మండలంలోని ఐఎస్.జగన్నాధపురంలో సుందరగిరిపై మహిమాన్వితుడిగా విరాజిల్లుతోన్న శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు కన్నులపండువగా జరుగుతున్నాయి. అందులో భాగంగా శనివారం ఆలయంలో విశేష కార్యక్రమాలు నిర్వహించారు. ఈనెల 1 న ప్రారంభమైన ఉత్సవాలు 6 తో ముగియనున్నాయి. వేడుకల్లో భాగంగా ఉదయం ఆలయ ఆవరణలో నిత్యహోమాలు, మూలమంత్ర హవనాలు, బలిహరణలు, వేదపారాయణలను ఆలయ అర్చకులు, పండితులు ఘనంగా నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల గ్రామోత్సవం జగన్నాధపురం క్షేత్ర పురవీధుల్లో వైభవంగా జరిగింది. శ్రీదేవీ, భూదేవి సమేత నారసింహుడు తమ ఇంటి ముంగిటకు రావడంతో భక్తులు నీరాజనాలను సమర్పించి, భక్తి ప్రపత్తులను చాటారు. ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.


ఐఎస్.జగన్నాధపురం పురవీధుల్లో ఊరేగుతున్న నారసింహుడు


సుందరగిరిపై పాలపొంగళ్లను వండుతున్న మహిళలు

పాలపొంగళ్ల నైవేద్యం

సుందరగిరిపై స్వామివారిని దర్శించుకున్న పలువురు మహిళా భక్తులు పాలపొంగళ్లను తయారుచేసి స్వామివారికి నైవేద్యంగా స్వయంగా సమర్పించారు. ఆ తరువాత వారంతా నవగ్రహ, తులసి పూజలను జరిపి, భక్తి విశ్వాసాలతో స్వామివారిని దర్శించుకున్నారు. ఏటా ఇలా పాలపొంగళ్లను స్వామివారికి నైవేద్యంగా సమర్పిస్తున్నట్లు పలువురు భక్తులు తెలిపారు.

చింతాలమ్మ ఆలయ నిర్మాణం ఎప్పుడో?


కొయ్యలగూడెం గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయం


గ్రామదేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారు →

కొయ్యలగూడెం : కొయ్యలగూడెం గ్రామ ప్రజల ఇలవేల్పు శ్రీ చింతాలమ్మ అమ్మవారి ఆలయ నిర్మాణం కోసం ప్రజానీకం ఎదురుచూస్తోంది. గ్రామంలోని నడిబొడ్డున ఉన్న ఆలయం (పుట్టిల్లు ఆలయం) అదేవిధంగా అంకాల చెరువు గట్టుపై ఉన్న ఆలయం (మెట్టిల్లు ఆలయం) శిలా రూప గోపురాలతో నిర్మించాలని ఏళ్ల తరబడి ప్రజలు కోరుకుంటున్నారు. అయితే ప్రస్తుతం రెండు చోట్ల ఉన్న ఆలయాలు నిత్య పూజాది కైంకర్యాలకు, భక్తులు నిర్వహించుకునే శుభకార్యాలకు అనువుగా లేకుండా ఉందని భక్తులు వాపోతున్నారు. ఇటీవల రైతు సంఘం, ఆలయ అభివృద్ధి కమిటీల మధ్య ఏర్పడ్డ బేధాభిప్రాయాలతో గుడి నిర్మాణానికి జాప్యం కలుగుతుందని ప్రజలు పేర్కొంటున్నారు. అమ్మవారి మూల నిధికి సంబంధించి ఉన్న సొమ్ములు గ్రామంలోని కొందరి పెద్దల పేర్లున బ్యాంకులలో డిపాజిట్ అయి ఉన్నాయని, వాటితో ఆలయాల నిర్మాణం ప్రారంభిస్తే వందలాదిమంది భక్తులు విరాళాల ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారని సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి తెలిపారు. ఇప్పటినుంచి అభివృద్ధి పనులు ప్రారంభిస్తే జాతర సమయానికి పూర్తిస్థాయిలో ఆలయం రూపాంతరం చెందుకోగలదని ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా అంకాల చెరువు ఆలయం వద్ద నుంచి పోలవరం ప్రధాన రోడ్డు వరకు సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టడం వల్ల భక్తులు రాకపోకలు సాగించడానికి వీలవుతుందని అంటున్నారు.

మాదకద్రవ్యాల జోలికి పోవద్దు

జంగారెడ్డిగూడెం : మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే నష్టాలపై పట్టణంలోని సూర్య, వెంకటేశ్వరరావు, రామచంద్ర, త్రివేణి కాలేజీల్లో విద్యార్థులకు సీఐ బాల సురేష్‌బాబు, ఎస్సై ఎం.సాగర్‌బాబు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ ఆదేశాల మేరకు జంగారెడ్డిగూడెం ఇన్‌చార్జి డీఎస్పీ కేవీ సత్యనారాయణ ఆధ్వర్యంలో సీఐ, ఎస్సై కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ సురేష్‌బాబు మాట్లాడుతూ ఈ మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం చేయాలన్నారు. గంజాయి, ఇతర మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత ఆరోగ్యంపై కలిగే నష్టాలను, భవిష్యత్‌లో ఏ విధంగా వారి జీవితాలపై ప్రభావం చూపుతుందో సీఐ వివరించారు. ఎక్కడైనా మత్తుపదార్థాలను అమ్ముతున్నా, లేదా సేవిస్తున్నా వారి వివరాలను టోల్ ఫ్రీ నెంబర్ 14500 గాని దగ్గరలో ఉన్న పోలీసులకు తెలియచేయాలన్నారు. కార్యక్రమంలో వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


యువతకు అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సీఐ, ఎస్సై

ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్ట్ చైర్మన్‌గా బొండాడ

ద్వారకాతిరుమల : క్షేత్రంలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్ట్ అభివృద్ధికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ట్రస్ట్ నూతన చైర్మన్ బొండాడ రామ్మోహన్‌రావు(రాంపండు) అన్నారు. స్థానిక కల్యాణ మండపంలో ట్రస్ట్ చైర్మన్ పదవికి ఈనెల 3, 4 తేదీల్లో నామినేషన్ల ప్రక్రియ జరగ్గా, అందులో భీమవరానికి చెందిన బొండాడ రామ్మోహన్‌రావు ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. దాంతో ఆయన చైర్మన్‌గా ఎన్నికైనట్టు ఎన్నికల అధికారి జయవరపు శ్రీరామ మూర్తి శనివారం ప్రకటించారు. ఈ పదవీకాలం 3 సంవత్సరాల ఒక నెల ఉంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన రామ్మోహన్‌రావు విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. ఈ కల్యాణ మండప ట్రస్ట్ 1999లో ప్రారంభమైందని, అప్పటి నుంచి రెండు నెలలు మినహా మిగిలిన కాలమంతా తానే చైర్మన్‌గా పనిచేసినట్టు చెప్పారు. ట్రస్టు సభ్యులు తనపై ఎంతో నమ్మకంతో మళ్లీ చైర్మన్‌గా ఎన్నుకున్నారని అన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ అన్నదానం చైర్మన్ యిమ్మడి నాగు, కార్యదర్శి నార్ల కాశీనాథం, సహాయ కార్యదర్శి యిమ్మడి రత్నాజీ, ట్రెజరర్ నల్లమెల్లి జగన్నాధరావు, వైస్ చైర్మన్లు ఒంటిపల్లి బాలభాస్కరరావు, గుంట్ల గణపతి తదితరులున్నారు.


ఆర్యవైశ్య కల్యాణ మండప ట్రస్ట్ చైర్మన్‌గా బాధ్యతలు చేపడుతున్న రామ్మోహన్‌రావు

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

బుట్టాయగూడెం : ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేసేలా అధికారులు కృషి చేయాలని ఎంపీపీ కారం శాంతి రమణ, మండల ప్రత్యేక అధికారి రమాదేవి, తహసీల్దార్ ఎస్.శారా శాంతి అన్నారు. స్థానిక సచివాలయంలో శనివారం మండలంలో చేపట్టిన గృహ నిర్మాణ పనులపై లబ్ధిదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని 21 పంచాయతీల్లో మంజూరైన గృహాల లబ్ధిదారులు అధికారులకు సహకరించి పనులు పూర్తి చేయాలన్నారు. ఈఈ మణికంఠ మాట్లాడుతూ మండలంలో సుమారు 1,870 గృహాలు మంజూరుకాగా పనులు వివిధ దశల్లో ఉన్నాయన్నారు. బుట్టాయగూడెం సచివాలయం-1 పరిధిలో 155 ఇళ్లు మంజూరయ్యాయని చెప్పారు. లబ్ధిదారులు త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా కృషి చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీహరి, సర్పంచ్ తెల్లం వెంకాయమ్మ, వెలుగు ఏపీఎమ్ పద్మావతి, తదితరులు పాల్గొన్నారు.


బుట్టాయగూడెంలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శాంతి

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన

కొయ్యలగూడెం : ట్రాఫిక్ నిబంధనలు తెలుసుకోకపోవడం వల్ల తరచూ రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయని ఈ విషయంలో చదువుకున్న వారు సైతం నిర్లక్ష్యం కనబరుస్తున్నారని పోలవరం సీఐ కె.విజయబాబు పేర్కొన్నారు. శనివారం పొంగుటూరు గ్రేప్స్ కళాశాలలో ఎస్సై జేజే విష్ణువర్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీఐ మాట్లాడుతూ ట్రాఫిక్ రూల్స్ ప్రతి ఒక్కరూ విధిగా పాటించాలన్నారు. వాహనాలు నడిపే వ్యక్తులు అందరూ లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. ఈ సందర్భంగా ట్రాఫిక్‌లో ఉండే అంశాలపై విద్యార్థులకు ఉన్న సందేహాలను పోలీసు అధికారులు వివరణాత్మకంగా అవగాహన కల్పించారు.


పొంగుటూరు కళాశాలలో ట్రాఫిక్‌పై అవగాహన కల్పిస్తున్న సీఐ, ఎస్సైలు

వీరభద్రునికి గండ దీపాలతో మొక్కుబడి


గండ దీపాలతో మొక్కుబడి చెల్లించుకుంటున్న భక్తులు

కామవరపుకోట : స్థానిక వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు స్వామివారికి కల్యాణం నిర్వహించనున్నట్లు వంశపారపర్య ఆలయ ధర్మకర్త కొండూరు శ్రీధర్ తెలిపారు. శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం, అఖిల గాండ్ల తేలీల సంఘ ఆధ్వర్యంలో ఉండు అక్కయ్య శర్మ, ఆలయ అర్చకులు మేడూరు శర్మ ఈ కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా శనివారం భక్తులు గండదీపాలతో మొక్కు చెల్లించుకున్నారు. ఉదయం నుంచి ఉపవాసం ఉన్న భక్తులు సాయంకాలం పాత్రలో నూనె పోసి దీపం వెలిగించి, ఆ దీపాన్ని శిరస్సుపై ఉంచి ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేసి స్వామివారిని దర్శించుకున్నారు. ఏటా ఈ మొక్కుబడులు చెల్లించడానికి సుదూర ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారు.

ఇష్టంగా చదివితేనే ఉన్నతస్థాయి

- రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ రాజేంద్రప్రసాద్

లింగపాలెం : విద్యార్థులు ఇష్టంగా చదివితే ఉన్నతస్థాయికి చేరుకోగలరని రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ డాక్టర్ జంగం రాజేంద్రప్రసాద్ అన్నారు. శనివారం ధర్మాజీగూడెం జెడ్పీ హైస్కూల్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ హక్కులను, చట్టాలను సద్వినియోగం చేసుకోవాని విద్యార్థులకు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం బాలల సంక్షేమ, అభివృద్ధికి ప్రవేశపెడుతున్న పథకాలను వినియోగించుకోవాలన్నారు. తల్లిదండ్రుల పట్ల గౌరవమర్యాదలతో ప్రవర్తించాలని, ఉపాధ్యాయులతో వినయవిధేయతలు కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. పట్టుదలతో క్రమశిక్షణ కలిగిన విద్యను అభ్యసిస్తే భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను సాధించడం సులభతరమన్నారు. విద్యార్థులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే టోల్‌ఫ్రీ నంబర్ 1098కి ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ప్రతి సచివాలయానికి ఒక మహిళా పోలీస్‌ను ప్రభుత్వం నియమించిందన్నారు. అనంతరం రాజేంద్రప్రసాద్ ఉపాధ్యాయులకు పలు సూచనలు, సలహాలను తెలియజేశారు. విద్యాబోధనలో ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. ఎంఈఓ కె.రామారావు, హెచ్ఎం బీవీయస్‌యస్ రాజు, సీఆర్‌పీ జి.కుమార్ మంగళం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతున్న రాష్ట్ర బాలల హక్కుల కమిషన్ మెంబర్ రాజేంద్రప్రసాద్

9న అభయాంజనేయుని ఆలయ వార్షికోత్సవం


వార్షికోత్సవ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : స్థానిక ఇందిరానగర్ కాలనీలో కొలువైయున్న శ్రీఅభయాంజనేయస్వామి వారి ఆరవ వార్షికోత్సవం ఈ నెల 9న నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణకర్త వలవల తాతాజీ, మేరీ సుశీలా అన్నారు. శనివారం వార్షికోత్సవానికి సంబంధించిన ఆహ్వానపత్రాలను ఆవిష్కరించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న 5వ వార్డు కౌన్సిలర్ కరుటూరి రమాదేవి, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షురాలు పీసుపాటి రామలక్ష్మి చేతుల మీదుగా వార్షికోత్సవ ఆహ్వాన పత్రాలను ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ ప్రతినిధులు మద్దిపాటి శ్రీను, పెదవేగి రాంబాబు, బసవరాజు వేణు, తెల్లగొర్ల సోమరాజు, శివ, పండు తదితరులు పాల్గొన్నారు.

చర్మకారులకు పింఛన్ మంజూరు చేయాలి

ఏలూరు (టూటౌన్): డప్పు కళాకారులు, చెప్పులు కుట్టే కార్మికుల్లో అర్హులందరికీ పింఛన్లు మంజూరు చేయాలని ఏపీ రాష్ట్ర బహుజన సేన సమితి రాష్ట్ర అధ్యక్షుడు జిజ్జువరపు రవిప్రకాష్ ప్రభుత్వాన్ని కోరారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని సంఘ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. చర్మకారులకు హెల్త్ కార్డులు, రుణాలు, యూనిట్లు మంజూరు చేయాలని కోరారు. పలువురు బీఎస్ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నవరం వెళ్లి పింఛన్ అందజేత


నాగరాజుకి పింఛన్ అందజేస్తున్న వలంటీర్

జంగారెడ్డిగూడెం రూరల్ : మండలంలోని పేరంపేట గ్రామానికి చెందిన వలంటీర్ రాజేష్ 100 కిలోమీటర్లు ప్రయాణం చేసి లబ్ధిదారునికి పింఛన్ సొమ్మును అందజేసి సేవా దృక్పథాన్ని చాటుకున్నాడు. గ్రామానికి చెందిన పల్లంట్ల నాగరాజు గన్నవరంలో ఒక ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. అతనికి వలంటీర్ రాజేష్ శనివారం గన్నవరం వెళ్లి వృద్ధాప్య పింఛన్ సొమ్మును అందజేశారు. ఈ సందర్భంగా వలంటీర్‌ను పలువురు అభినందించారు

నేటి నుంచి జాతర

బుట్టాయగూడెం : మండలంలోని మారుమూల గ్రామమైన కామవరం సమీపంలో కొలువై ఉన్న గద్దె రాజులు, గుబ్బల మంగమ్మతల్లి, కనకదుర్గమ్మ అమ్మవార్ల జాతర మహోత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ జాతర మహోత్సవాలకు సంబంధించి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. గద్దెరాజులు, గుబ్బల మంగమ్మ, కనకదుర్గమ్మ అమ్మవార్లను అలంకరించి ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. 9వ తేదీ వరకూ ఈ జాతర మహోత్సవాలు జరగనున్నాయి.

అగ్నిప్రమాదంలో తాటాకిళ్లు దగ్ధం

కుక్కునూరు : విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా జరిగిన అగ్నిప్రమాదంలో గుండుగూడెం గ్రామానికి చెందిన సొడే చుక్కమ్మ, కారం పాపారావులకు చెందిన తాటాకిళ్లు దగ్ధమయ్యాయి. శనివారం సాయంత్రం సమయంలో గుండుగూడెం గ్రామానికి చెందిన సొడే రాముడు ఇంట్లో విద్యుత్ షార్ట్‌సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి ఇంటి పైకప్పుకు అంటుకున్నాయి. ఆ మంటలు పక్కనే ఉన్న కారం పాపాయమ్మ ఇంటికి వ్యాపించడంతో రెండు తాటాకిళ్లు మంటల్లో కాలిపోయాయి. వెంటనే సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపుచేసి పక్క ఇళ్లకు వ్యాపించకుండా చేయడంతో గ్రామస్తులు ఊపిరి పీల్చుకున్నారు. కాగా ఈ ప్రమాదంలో రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగినట్టు అధికారులు చెప్పారు.

మహిళపై దాడిచేసిన వ్యక్తిపై కేసు నమోదు

ద్వారకాతిరుమల : పొలంకు వెళ్లిన ఒక మహిళపై దాడిచేసి గాయపరచిన వ్యక్తిపై శనివారం కేసు నమోదు చేసినట్టు ఎస్సై టి.సుధీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పి.కన్నాపురానికి చెందిన తుంగా జాన్సీరాణి తల్లి దండ్రులకు, అదే గ్రామానికి చెందిన తుంగా జగన్నాధం పొలాలకు మధ్య ఉమ్మడి బోరు ఉంది. అయితే జాన్సీరాణి ఉదయం పొలానికి వెళ్లి బోర్ ఆన్‌చేసి, పొలానికి తడిపెట్టేందుకు ప్రయత్నించింది. ఫీజులు లేకపోవడంతో బోర్ ఆన్ అవలేదు. ఫీజులు ఎందుకు తీశావని జగన్నాధంను ఆమె ప్రశ్నించగా అతడు కత్తితో ఆమెపై దాడి చేసి గాయపరిచాడు. ఆ సమయంలో కేకలు విని అక్కడికి చేరుకున్న బాధితురాలి అక్కలు హుటాహుటీన ఆమెను 108 అంబులెన్స్‌లో ఏలూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై తెలిపారు.

PUBLIC NOTICE

General Public, Banks, Financial Institutions are hereby put to notice that A.P. State Financial Corporation (APSFC), Eluru Branch is proposing to sanction a Term Loan of Rs.125.00 lakhs to M/s.G.K.R.Boards, Sy. No.592, Pangidigudem Road, Jangareddygudem, a partnership firm, rep. by its Mng. Partner Sri Gummadi Siva Rama Krishna Prasad. The firm is proposing to mortgage the following property belongs to Smt Gummadi Kamala Kumari, W/o.Late Gummadi Koteswara Rao, R/o Door No.8-3-335, Maruthi Nagar, Jangareddygudem, Eluru District.

House site admeasuring 500 sq. yds in R.S.No.539/2 situated nearer to Door No.8-3-343, Maruthi Nagar, Near Head Post Office, Jangareddygudem, Eluru District and bounded by East : Property belongs to Sri Pydi Raja rao and Others, West : Property belongs to Sri Bandi Prakasam Door No.8-3-343, North : Property belongs to Sri Alapati Satyanarayana and Others, South : Road.

The above said property was purchased by Smt Gummadi Kamala Kumari, W/o.Late Gummadi Koteswara Rao from Sri G Veera Venkata Satyanaga Vijaya Kumar, GPA holder of Sri Pala China Venkata Sambamurthy under Regd. Sale deed doc. No.706/2009, dt.19.02.2009.

The said proposed Mortgagers claim that they have no other document in respect of the said property and that the said property is free from any encumbrances and are in their peaceful possession and enjoyment and they propose to create equitable mortgage in favour of APSFC by deposit of the above original documents.

If any body has any objections over the above property may lodge their objections with documentary evidence thereof with the undersigned within 7 days of this notice. Else it will be deemed that there are no objections and this property will be construed as having clear title and will be taken for mortgage and subsequent objections if any will not be entertained/ binding to us.

Date : 04.02.2023
Branch Manager, A.P.State Financial Corporation, N.R.Pet, Eluru. P.No.9949358512